క్లుప్తంగా

నేడు మండల సమావేశం

లక్కిరెడ్డిపల్లె : నేడు ఎంపీడీఓ సభా భవనంలో ఎంపీపీ మద్దిరేవుల సుదర్శన్‌రెడ్డి అధ్యక్షతన మండల సమావేశాన్ని నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ వెంకటరామిరెడ్డి శుక్రవారం తెలియజేశారు. ఈ సమావేశానికి రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డిలు ముఖ్య అతిథులుగా హాజరుకానున్నారని తెలిపారు. మండలంలోని సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, మండలస్థాయి అధికారులు తప్పక హాజరుకావాలని ఎంపీడీఓ కోరారు.

29న ఉచిత వైద్యశిబిరం

రాయచోటి అర్బన్ : పట్టణంలో ఈనెల 29వతేదీ ఆదివారం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు లయన్స్ క్లబ్ అధ్యక్షుడు షేక్ మహమ్మద్ తెలిపారు. ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు నేతాజీ సర్కిల్‌లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శిబిరం ఉంటుందన్నారు. శిబిరంలో బీపీ, షుగర్, బోన్ డెన్సిటీ పరీక్షలు చేయబడతాయన్నారు. న్యూరో, ఆర్థో సమస్యలు, దంత సమస్యలకు అనుభవజ్ఞులైన వైద్యులచే చికిత్సలు చేయబడతాయంటూ తెలిపారు. ఉచిత వైద్యశిబిరాన్ని రాయచోటి, లక్కిరెడ్డిపల్లె ప్రాంతవాసులు సద్వినియోగం చేసుకోవాలంటూ ఆయన విజ్ఞప్తి చేశారు.

వైభవంగా ఉరుసు మహోత్సవం



ప్రత్యేక అలంకరణలో హజరత్ సయ్యద్ షావలీ సమాధి

సిద్దవటం : మండలంలోని మాచుపల్లె గ్రామ సమీపంలోని హజరత్ సయ్యద్ షావలీ దర్గాలో గురువారం రాత్రి ఉరుసు మహోత్సవం వైభవంగా నిర్వహించామని దర్గా కమిటీ సభ్యులు తెలిపారు. ఉరుసులో ముస్లింలు, హిందువులు పాల్గొని ప్రార్థనలు జరిపారు. సిద్దవటం వైస్ ఎంపీపీ నారపురెడ్డి శ్రీనివాసుల రెడ్డి భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. వైఎస్ఆర్‌సీపీ నాయకుడు ఉపాసి వెంకటరమణారెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఖవ్వాలి ఆకట్టుకుంది.

ఎరువుల దుకాణాల తనిఖీ



తనిఖీ చేస్తున్న విజిలెన్స్ అధికారులు

రాజంపేట రూరల్ : పట్టణ, మండల పరిధిలోని పలు ఎరువుల దుకాణాలలో విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఐటీపీటీ రెడ్డెయ్య, డీఈఈ పి.లంకేశ్వర్‌రెడ్డి, ఏజీ మైన్స్ అధికారి జి.శ్రీనివాసులు ఏఓ జి.రాజకుమారితో కలిసి తనిఖీలు చేశారు. దుకాణాల్లో స్టాక్ రిజిస్టార్‌లు, లైసెన్స్‌లు తదితర రికార్డులను పరిశీలించారు. పురుగు మందులు, ఎరువులు, నకిలీ విత్తనాలను అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

బాధ్యతతో పని చేయండి



మాట్లాడుతున్న అధికారి పి.పద్మావతి

రాజంపేట రూరల్ : విధి నిర్వహణలో బాధ్యతగా వ్యవహరించాలని, నిర్లక్ష్యంగా ఉండరాదని అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ లేబర్ పి.పద్మావతి తెలిపారు. అన్నమయ్య ప్రైవేట్ ఎలక్ట్రికల్ వర్కర్స్ అసోషియేషన్ 4వ వార్షికోత్సవ వేడుకలను శుక్రవారం న్యూ ఆంధ్ర ఫంక్షన్ హాల్‌లో ఘనంగా నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ.. విధులు చేసే సమయంలో ప్రమాదాలకు ఆస్కారం లేకుండా మెళుకువగా ఉండాలని సూచించారు. ఈ వేడుకలలో అసోషియేషన్ జిల్లా జాయింట్ సెక్రటరీ బి.నరసింహులు, రాజంపేట గౌరవ అధ్యక్షుడు ఎం.తరుణ్‌కుమార్, అధ్యక్షుడు కేవీకేఎస్ వర్మ, ఉపాధ్యక్షుడు ఏ.మహంకాళయ్య, సెక్రటరీ ఎం.సంజీవనాయుడు, జాయింట్ సెక్రటరీ శేఖర్, ట్రెజరీ వి.సురేష్ ప్రభాకరాచారీ, ఆర్గనైజర్ నాగేశ్వరరెడ్డి, నాగార్జునరెడ్డి, కృష్ణ, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

నూతన కమిటీ ఎంపిక

లక్కిరెడ్డిపల్లె : మండలంలో నూతనంగా నవ్యాంధ్ర కాపు (బలిజ) సంఘం ఎంపిక చేసినట్లు వ్యవస్థాపకుడు కె.వెంకటేశ్వర్లు, సహ వ్యవస్థాపకుడు కడియాల వెంకట సూర్యప్రసాద్‌లు ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం మండలంలోని బలిజ కులస్తుల అభిప్రాయంతో కమిటీని ఎంపిక చేశామన్నారు. అధ్యక్షుడిగా నగుబోతు భాస్కర్, ఉపాధ్యక్షులుగా కావలి ఆంజనేయులు, రాజబాబు, శ్రీనివాసులు, గంగిశెట్టి రాజ, డీలర్ రెడ్డయ్య, డీలర్ ప్రసాద్‌లు ఎంపిక కాగా ప్రధాన కార్యదర్శి యనమల విశ్వనాథ్, సహాయ కార్యదర్శి కె.ఆంజనేయులు, ఆర్థిక కార్యదర్శిగా గంట వెంకటకృష్ణ, ఆర్గనైజింగ్ సెక్రటరీగా గోవిందు శ్రీకాంత్, సేవా కన్వీనర్‌గా పక్కీరయ్య, సెక్రటరీలు చిన్న కొండు భాస్కర్, ఆవుల ఆంజనేయులు, మచ్చ జయరాం, నంది బాబు, వీడియో కన్వీనర్లుగా పి.ధనుంజయ, జి.సురేష్, జాయింట్ సెక్రటరీలు శివశంకర్, కోనంపేట భాస్కర్, కస్తూరి రాజుగారిపల్లి మధుసూదన్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఆ ప్రకటనలో తెలిపారు.

రాహుకాల పూజలు



పట్టణంలోని శ్రీ వీరభద్రస్వామి ఆలయంలోని భద్రకాళి అమ్మవారికి రాహుకాల పూజలు నిర్వహించారు. శుక్రవారం అమ్మవారికి ఆలయ ప్రధాన అర్చకులు కృష్ణయ్య స్వామి, వేదపండితులు రాచరాయ యోగీ స్వామి వారి ఆధ్వర్యంలో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి అభిషేకాలు, పూజలు చేశారు. భక్తులకు రాహుకాల పూజల విశేషాలను వివరించి తీర్థప్రసాదాలు అందజేశారు. – రాయచోటి టౌన్

భక్త వీరాంజనేయుడికి..



మండల పరిధిలోని మాధవరంలో ఉన్న శ్రీ భక్త వీరాంజనేయ స్వామి ఆలయంలో రథసప్తమి పండుగను పురస్కరించుకొని శుక్రవారం ప్రత్యేక పూజలను ఆలయ కమిటీ వారు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వారికి అభిషేకం, అలంకరణ, గణపతిపూజ, ఆకుపూజ, వడమాల పూజ, సహస్రనామార్చన వంటి పూజలును నిర్వహించారు. భక్తులు స్వామివారిని దర్శించుకొని తీర్థప్రసాదాలను అందజేశారు. అఖండ భజనలు చేశారు. గ్రామ పెద్దలు, మహిళలు, యువకులు, చిన్నారులు పాల్గొన్నారు. – సిద్దవటం

వేంకటేశ్వరుడి కల్యాణం



మండలంలోని పెనగలూరు గ్రామ సమీపంలో ఉన్న వేంకటేశ్వర స్వామి ఆలయంలో కల్యాణం శుక్రవారం వైభవంగా నిర్వహించారు. కొత్త కృష్ణయ్య కుమారుడు మధుసూదన్ దంపతులు ఈ కల్యాణాన్ని నిర్వహించారు. గ్రామ పురోహితుడు చెంచు సుబ్బనరసయ్య ఆధ్వర్యంలో 9 మంది పేద పండితులు ఈ కల్యాణాన్ని నిర్వహించారు. అన్నదానం ఏర్పాటు చేశారు. అనంతరం ఉత్సవమూర్తులను గ్రామంలో ఊరేగింపు చేశారు. మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కల్యాణాన్ని చూసేందుకు పరిసర గ్రామాల ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. – పెనగలూరు

సమన్వయంతోనే మండలాభివృద్ధి సాధ్యం

- అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి
- ఎంపీడీఓ మల్‌రెడ్డి, ఏపీఎంఐపీసీ డైరెక్టర్ రాయవరం శ్రీనివాసులురెడ్డి



మాట్లాడుతున్న ఏపీఎంఐపీసీ డైరెక్టర్ శ్రీనివాసులురెడ్డి, పాల్గొన్న అధికారులు

రాయచోటి అర్బన్ : మండలంలోని అన్నిశాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయడం ద్వారానే మండల అభివృద్ధి సాధ్యమవుతుందని ఎంపీడీఓ మల్‌రెడ్డి, ఏపీఎంఐపీసీ డైరెక్టర్ రాయవరం శ్రీనివాసులురెడ్డిలు అన్నారు. శుక్రవారం రాయచోటి ఎంపీడీఓ సభా భవనంలో ఎంపీపీ రాజమ్మ అధ్యక్షతన రూరల్ మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్నివర్గాల ప్రజల సంక్షేమం కోసం సీఎం జగనన్న ఎంతో శ్రమిస్తున్నారన్నారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలన్ని అర్హులకు చేరాలంటే అధికారులకు ప్రజాప్రతినిధుల సహకారం అవసరమన్నారు. విద్య, వైద్యం, ఆరోగ్యం, వ్యవసాయం తదితర రంగాల్లో సమూల మార్పులు తీసుకువస్తున్నట్లు చెప్పారు. ముఖ్యంగా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో అర్బన్ క్లినిక్‌లతో పాటు ప్రతి గ్రామంలో విలేజ్ క్లినిక్‌లను ఏర్పాటు చేసి పేదలందరికి వైద్యసేవలందించాలని సీఎం జగన్ సంకల్పించారంటూ చెప్పారు. అనంతరం ఎంపీడీఓ మల్‌రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమం, అభివృద్ధి పథకాల గురించి ఆయాశాఖల అధికారులు సర్పంచులు, ఎంపీటీసీలకు తెల్పాలంటూ సూచించారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు సమన్వయంతో పని చేస్తూ ముందుకు సాగినప్పుడే మండలంలో ఆశించిన అభివృద్ధి జరుగుతుందంటూ చెప్పారు. అనంతరం వివిధ ప్రభుత్వశాఖల అధికారులు తమతమ శాఖల నివేదికలను సభ్యులకు వివరించారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారిణి సుస్మిత, మండల ఉపాధ్యక్షుడు జయపాల్‌రెడ్డి, ఎంపీటీసీలు, సర్పంచులు, గ్రామ పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

రైతులు చిరుధాన్యాలను సాగు చేయాలి



రైల్వేకోడూరు రూరల్: అవగాహన కల్పిస్తున్న పంజం సుకుమార్ రెడ్డి

రైల్వేకోడూరు రూరల్ : ప్రతి రైతు చిరుధాన్యాలపై దృష్టి సారించాలని వ్యవసాయ సలహా మండలి జిల్లా ఛైర్మన్ పంజం సుకుమార్ రెడ్డి అన్నారు. అంతర్జాతీయ చిరుధాన్యాల సంవత్సరంలో భాగంగా రైల్వేకోడూరు మండలంలోని అనంతరాజుపేట ప్రభుత్వ పాఠశాలలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం రైతులకు చిరుధాన్యాల సాగుపై అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ ఆహారభద్రతతో పాటు చిరుధాన్యాలు తీసుకుంటే ప్రజలు ఆరోగ్యంగా ఉంటారన్నారు. చిరుధాన్యాలు పండిస్తున్న రైతులను దృష్టిలో ఉంచుకున్న సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఆ పంటకు మద్దతు ధరను కల్పిస్తున్నారని గుర్తు చేశారు. జిల్లా వ్యవసాయ అధికారిణి ఉమామహేశ్వరమ్మ మాట్లాడుతూ తక్కువ నీరు, తక్కువ ఖర్చుతో చిరుధాన్యాల సాగు చేసి ఆదాయం పొందవచ్చన్నారు. రైతులకు సరైన సమయంలో పంటల సాగుకు సలహాలు, సూచనలివ్వడానికి సిబ్బంది ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటారని, వారి సేవలు వినియోగించాలని సూచించారు. అనంతరం చిరుధాన్యాల ప్రాముఖ్యతను వివరించి స్టాల్‌లను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి సర్పంచ్ పెంచలమ్మ, జెడ్పీటీసీ రత్నమ్మ, ఏడీఏ కవిత, హెచ్ఓ ఆశియా, ఏఓ సుధాకర్, ఎంపీటీసీలు జనార్దన్ రాజు, మల్లికార్జున, ఉప సర్పంచ్ సుబ్రమణ్యం, డీడీఏ సావిత్రి, సిబ్బంది పాల్గొన్నారు.

ఓబులవారిపల్లెలో..

ఓబులవారిపల్లె : చిరుధాన్యాల పంటలను రైతులు సాగు చేయాలని జిల్లా వ్యవసాయ సలహా మండలి బోర్డు ఛైర్మన్ పంజం సుకుమార్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం వైకోట, కొర్లకుంట సచివాలయాలను పంజం సుకుమార్‌రెడ్డి, జిల్లా వ్యవసాయ సహాయ సంచాలకులు కవిత, వ్యవసాయ అధికారులు రైతు భరోసా కేంద్రాలను ఆకస్మికంగా పరిశీలించారు. రికార్డులను పరిశీలించి సిబ్బందికి సూచనలు, సలహాలు ఇచ్చారు. రైతు భరోసా కేంద్రంలో సిబ్బంది పనితీరుపై సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం పంజం సుకుమార్‌రెడ్డి మాట్లాడుతూ ఈ ఏడాది ఎక్కువ మోతదులో చిరుధాన్యాల ఉత్పత్తి చేసే విధంగా కేంద్రం చర్యలు తీసుకుంటోందని అన్నారు. చిరుధాన్యాలకు ప్రస్తుతం మార్కెట్‌లో డిమాండ్ ఉందని, రైతులు తమ పంటను మార్పిడి చేసేందుకు చిరుధాన్యాలు పండించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైకోట సర్పంచ్ మల్లెం ఈశ్వరయ్య, వ్యవసాయ అధికారి శ్రీరాములు, ఎంపీటీసీ సభ్యులు వత్తలూరు రోహిణి కుమార్‌రెడ్డి, దేశయ్య పాల్గొన్నారు.

దేవాలయాల అభివృద్ధికి పెద్దపీట



భూమిపూజలో పాల్గొన్న ఎమ్మెల్యే కొరముట్ల, అజయ్ రెడ్డి, గుండాల్ రెడ్డి తదితరులు

రూ.60 లక్షలతో శివాలయ పునఃనిర్మాణ పనులు ప్రారంభం

పెనగలూరు : మండలంలోని ఈటమాపురం గ్రామ సమీపంలో నూతన శివాలయ నిర్మాణానికి శుక్రవారం భూమిపూజ నిర్వహించారు. ఈ భూమిపూజ కార్యక్రమానికి ప్రభుత్వవిప్ కొరముట్ల శ్రీనివాసులు, రాష్ట్ర స్కిల్ డెవలప్‌మెంట్ ఛైర్మన్ కొండూరు అజయ్‌రెడ్డి, ఆలయ నిర్మాణ దాత బత్తిన పెద్ద గుండాల రెడ్డి, తిరుపాల్ రెడ్డి, ఎండోమెంట్ అధికారులు హాజరయ్యారు. తిరుపతి నుంచి ప్రత్యేకంగా విచ్చేసిన వేదపండితులు ముందుగా హోమం నిర్వహించి అనంతరం భూమిపూజ చేశారు. పురాతనకాలం నాటి శివాలయం పాడుబడటంతో ఈటమాపురానికి చెందిన పారిశ్రామికవేత్త గుండాలరెడ్డి ఆధ్వర్యంలో ఎండోమెంట్‌కు రూ. 12 లక్షలు డిపాజిట్ చేసి రూ. 60 లక్షల నిధులను మంజూరు చేయించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కొరముట్ల, అజయ్‌రెడ్డిలు మాట్లాడుతూ దేవాలయాల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని, పురాతనకాలం నాటి ఆలయాలు తొలగించి నూతన ఆలయాలు నిర్మించుకోవాలంటే ఎండోమెంట్ ద్వారా నిధులు మంజూరు చేయిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఈటమాపురం శంకర్ రెడ్డి, వేణుగోపాల్ రెడ్డి, ఎండోమెంట్ అధికారులు పాల్గొన్నారు.

మొదటి ప్రాధాన్యతతో ఆశీర్వదించండి



ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న వెన్నపూస రవీంద్రారెడ్డి

రాయచోటి టౌన్ : ప్రథమ ప్రాధాన్యతా ఓటు వేసి ఆశీర్వదించాలని పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డి ఉపాధ్యాయులు, సిబ్బందిని అభ్యర్థించారు. శుక్రవారం రాయచోటి శ్రీ సాయి ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహించిన సైన్స్ ఎగ్జిబిషన్‌ను డీఈఓ రాఘవరెడ్డితో కలసి సందర్శించారు. వీరి వెంట బేపారి మహమ్మద్, మున్సిపల్ వైస్ ఛైర్మన్ ఫయాజుర్ రహిమాన్, వైఎస్సార్‌సీపీ నాయకులు సుగవాసి శ్యామ్ కుమార్, అమీర్, జావెద్, చంద్రశేఖర్ నాయుడు, చిన్న తదితరులు పాల్గొన్నారు.

అంతర్జాతీయ పోటీల్లో విద్యార్థి సత్తా



విద్యార్థులను అభినందిస్తున్న సీఐ నరసింహారావు

రాజంపేట టౌన్ : ఇటీవల గోవాలో జరిగిన అంతర్జాతీయ కరాటే పోటీల్లో సీనియర్స్ విభాగంలో రాజంపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బీకాం తృతీయ సంవత్సరం చదువుతున్న మన్నూరు వంశీకృష్ణ బంగారు పతకాన్ని సాధించాడు. అలాగే ఇదే పోటీల్లో సబ్‌జూనియర్స్ విభాగంలో కేంద్రీయ విద్యాలయం విద్యార్థి పి.హర్ష ఆనంద్ వెండి పతకాన్ని కైవసం చేసుకున్నాడు. అంతర్జాతీయ కరాటే పోటీల్లో విశేష ప్రతిభ కనబరచి పతకాలు సాధించిన విద్యార్థులను శుక్రవారం ఇక్కడి ఇండియన్ బోధి ధర్మ ఆనంద్ కరాటే ఆకాడమీలో అర్బన్ సీఐ నరసింహారావు అభినందించారు. ఎస్ షిటో రియో కరాటే అసోసియేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో జరిగిన అంతర్జాతీయ కరాటే పోటీల్లో తమ విద్యార్థులు పతకాలు సాధించినట్లు మాస్టర్ తెలిపారు.

రేపటి నుంచి పాదయాత్ర



కసిరెడ్డి శివారెడ్డి

గాలివీడు : మండల కేంద్రం నుంచి ఇడుపులపాయకు రెండు రోజులపాటు చేపట్టే పాదయాత్ర రేపటి నుంచి (ఆదివారం) ప్రారంభమవుతుందని ఆంధ్రప్రదేశ్ రెడ్డి సంఘం రాష్ట్ర అధ్యక్షులు కసిరెడ్డి వెంకటశివారెడ్డి తెలిపారు. శుక్రవారం పాత్రికేయులతో ఆయన మాట్లాడుతూ ఈనెల 29వ తేదీ ఆదివారం వెలుగల్లు జలాశయం వద్ద వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి పాదయాత్రను ప్రారంభించి ఇడుపులపాయలోని వైఎస్సార్ ఘాట్ వద్ద ముగుస్తుందని పేర్కొన్నారు. వెలుగల్లు జలాశయం నిర్మాణంతో సాగునీరు, తాగునీరు అందించిన అపర భగీరథుడు వైఎస్సార్‌ను స్మరించుకుంటూ ఈ పాదయాత్రను చేస్తున్నట్లు స్పష్టం చేశారు.

పట్టుదల ఉంటే ఏదైనా సాధ్యం



విద్యార్థిని కౌసర్‌ను అభినందిస్తున్న దృశ్యం

రాజంపేట టౌన్ : పట్టుదల ఉంటే విద్యార్థులు ఏదైనా సాధ్యమని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ రామిరెడ్డి తెలిపారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బైపీసీ ద్వితీయ సంవత్సరం చదువుతున్న షేక్ నాజనీన్‌కౌసర్ ఫెన్సింగ్ సాబర్ విభాగంలో జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైంది. దీంతో శుక్రవారం ఆ విద్యార్థినికి ప్రిన్సిపాల్ మెమెంటో బహుకరించి చిరు సత్కారం చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కృషి, పట్టుదలతోనే జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక కాగలరని తెలిపారు. ఫెన్సింగ్‌లో నాజనీన్‌కౌసర్ విశేష ప్రతిభ కనబరచి జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక కావడం గర్వకారణమన్నారు. విద్యార్థులు విద్యతోపాటు ఏదైనా క్రీడల్లో ప్రావీణ్యత పొందాలన్నారు. కాగా ఇటీవల నంద్యాలలో జరిగిన రాష్ట్రస్థాయి ఫెన్సింగ్ ఫాయిల్ విభాగంలో తృతీయ స్థానంలో నిలిచిన జె.రామలక్ష్మి, డి.పవిత్ర, ఏ.శ్రవంతిలను ప్రిన్సిపాల్ అభినందించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఫిజికల్ డైరెక్టర్ మురళీకృష్ణారెడ్డి, ఫెన్సింగ్ అసోసియేషన్ ప్రతినిధి రామాంజనేయులు, బోటనీ అధ్యాపకుడు మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

రసవత్తరంగా ముగ్గుల పోటీలు



బహుమతిని అందజేస్తున్న దృశ్యం

సిద్దవటం : మండలంలోని మాధవరం గ్రామంలో శుక్రవారం సాయంత్రం ముగ్గుల పోటీలు రసవత్తరంగా జరిగాయి. సీఎస్ఆర్ హ్యాండ్లూమ్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ముగ్గుల పోటీల్లో 52 మంది మహిళలు పాల్గొన్నారు. న్యాయనిర్ణేతలుగా కడపకు చెందిన పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఆకుల సుధారాణి, మాధవరం ఎస్‌బీఐ మేనేజర్ జ్యోతిర్మయి, ప్రసన్నలక్ష్మి, ఉషారాణి వ్యవహరించారు. పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు దాత సీఎస్ఆర్ హ్యాండ్లూమ్స్ అధినేత సీఎస్ రాయుడు, మొదటి బహుమతిని ఎస్.శ్వేత 32 ఇంచుల ఎల్ఈడీ టీవీని గెలుచుకోగా, రెండవ బహుమతిని మామిళ్ల ఆదిలక్ష్మి వాషింగ్ మిషన్, మూడవ బహుమతిని పాల విజయలక్ష్మి గ్రైండర్‌ను గెలుచుకుంది. ఈ బహుమతులను పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఆకుల సుధారాణి, ఎస్‌బీఐ మేనేజర్ జ్యోతిర్మయి చేతుల మీదుగా విజేతలకు అందజేశారు. పాల్గొన్న వారికి ప్రోత్సాహక బహుమతులను పంపిణీ చేశారు.

ఘనంగా కృష్ణదేవరాయలు 552 జయంతి



నివాళి అర్పిస్తున్న దృశ్యం

రైల్వేకోడూరు అర్బన్ : పట్టణంలోని మార్కెట్ వద్ద ఉన్న శ్రీ కృష్ణదేవరాయులు విగ్రహం వద్ద శుక్రవారం రాయలు వారి 552 జయంతిని కాపు నాయకులు ఘనంగా నిర్వహించారు. కృష్ణదేవరాయులు విగ్రహానికి పాలాభిషేకం నిర్వహించి గజమాల వేశారు. అలాగే కేక్‌ను కట్‌చేసి పంచారు. ఈ కార్యక్రమంలో కాపునాడు జిల్లా ఉపాధ్యక్షులు పంద్రా నాగేంద్ర, కాపు నాయకులు తోట శివసాయి, మందల నాగేంద్ర, సీహెచ్.రమేష్, నందాబాల, భాస్కర్, కొండేటి చలపతి, శ్రీకారపు శివయ్య, పోతురాజు నవీన్, చెన్నంశెట్టి శ్రీనివాసులు, తాతంశెట్టి నాగేంద్ర, హేమరాజ్, ముత్యాల కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

రైతులకు న్యాయమైన పరిహారమివ్వండి



సబ్‌కలెక్టర్‌తో చర్చిస్తున్న ఎంపీపీ విజయభాస్కర్‌రెడ్డి

నందలూరు(రాజంపేట) : నూతనంగా నిర్మించనున్న కడప– రేణిగుంట గ్రీన్‌ఫీల్డ్ హైవే నిర్మాణంలో భూములు కోల్పోయిన రైతులకు న్యాయమైన పరిహారం ఇవ్వాలని నందలూరు ఎంపీపీ మేడా విజయభాస్కర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం హైవే నిర్మాణంలో భూసేకరణ అంశంపై పరిశీలన నిమిత్తం నందలూరుకు వచ్చిన సబ్ కలెక్టర్ అహ్మద్‌ఖాన్‌ను ఎంపీపీ, రైతులు కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాగిరెడ్డిపల్లె అర్బన్ పరిధిలో ఎక్స్‌ప్రెస్ వే నిర్మాణం ఉంటుందన్నారు. భూసేకరణలో రైతులకు సరైన రీతిలో పరిహారం చెల్లింపులో అన్యాయం జరిగిందని వాపోతున్నారన్నారు. మార్కెట్ విలువ ప్రకారం పరిహారం ఇస్తే రైతులుకు మేలు జరుగుతుందని సబ్‌కలెక్టర్‌ను కోరామన్నారు. అవసరమైతే జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్, జాయింట్ కలెక్టర్ తమీమ్ అన్సారియాలను రైతుల పక్షాన కలుస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సౌభాగ్యమ్మ, తహసీల్దార్ ఉదయశంకర్‌రాజు, మండల కో–ఆప్షన్ సభ్యుడు ఖలీం, మండల ఉపాధ్యక్షుడు తుమ్మల భావనశ్రీధర్, ఎంపీటీసీ సోమిశెట్టి సునీతాప్రభాకర్, బీసీ నాయకుడు హిమగిరియాదవ్, ఎస్సీ మానటరింగ్ విజిలెన్స్ కమిటీ సభ్యుడు పెనుబాల నాగసుబ్బయ్య, రైతు విజయుడు తదితరులు పాల్గొన్నారు.

జాగ్రత్తల పాటింపుతో ప్రమాదాల నివారణ

భద్రతా వారోత్సవాల ప్రారంభంలో డీపీటీఓ జగదీష్



మాట్లాడుతున్న ఆర్టీసీ డీపీటీఓ జగదీష్

రాయచోటి అర్బన్ : వాహనచోదకులు తగు జాగ్రత్తలు పాటిస్తూ వాహనాలను నడిపినప్పుడే ప్రమాదాలను నివారించవచ్చునని అన్నమయ్య జిల్లా ప్రజారవాణా అధికారి జగదీష్ పిలుపునిచ్చారు. శుక్రవారం సాయంత్రం స్థానిక ఆర్టీసీ డిపోలో రోడ్డు భద్రతా వారోత్సవాల ప్రారంభ సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఆయన మాట్లాడుతూ డ్రైవర్లు తగు విశ్రాంతి తీసుకోవాలని, మత్తుపానియాలు సేవించి, సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ వాహనాలను నడపకూడదంటూ సూచించారు. డ్రైవింగ్‌పై ఏకాగ్రత లోపించిన సమయంలో ప్రమాదాలు జరుగుతాయన్నారు. రాయచోటి ఎంవీఐ సుబ్బరాయుడు, ఆర్టీసీ డిప్యూటీ సీఎంఈ ఇబ్బహీంలు మాట్లాడుతూ ఆర్టీసీ రోడ్డు భద్రతా వారోత్సవాలు నేటి నుంచి 2వతేదీ వరకు నిర్వహిస్తామన్నారు. డ్రైవర్లు ఎదురుగా వెళుతున్న వాహనాలను ఓవర్‌టేక్ చేసే సమయంలోనే ఎక్కువగా ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. గ్యారేజీ కార్మికులు బస్సులను మంచి కండీషన్‌లో డ్రైవర్లకు అప్పగించాలంటూ కోరారు. ప్రమాదజోన్‌లుగా గుర్తించిన ప్రాంతాల్లో డ్రైవర్లు నిదానంగా వాహనాన్ని నడపాలన్నారు. కార్యక్రమంలో డీఎం ధనుంజయతోపాటు డిపోలోని పలు విభాగాల అధికారులు, కార్మికులు పాల్గొన్నారు. వారితో అధికారులు ప్రమాణం చేయించారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు



పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

నందలూరు(రాజంపేట) : స్వర్ణాంధ్ర మదర్‌ల్యాండ్ విక్టరీ సేవా సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం నందలూరు రైల్వే ఇన్‌స్టిట్యూట్ రీడింగ్ రూంలో ఆ సంస్థ వార్షికోత్సవం సందర్భంగా వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో రాజంపేట ఐఎంఏ అధ్యక్షుడు, రైల్వే సీనియర్ మెడికల్ ఆఫీసర్ డా.జయభాస్కర్ మాట్లాడుతూ గెలుపు, ఓటములను సమానంగా స్వీకరించాలన్నారు. విద్యార్థులలో పోటీతత్వం పెంపొందించేందుకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు దోహదపడతాయన్నారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు వేపగుంట శ్యామ్‌రాజ్, ఉపాధ్యాయులు శేఖర్‌బాబు, చంద్రశేఖర్, సంస్థ సభ్యులు అరుణకుమార్, రవికుమార్, భరత్‌కుమార్, జస్వంత్, సాయి పాల్గొన్నారు.

మెస్, కాస్మోటిక్ చార్జీలను పెంచాలి



మాట్లాడుతున్న ప్రశాంత్

రాయచోటి అర్బన్ : పెరిగిన నిత్యావసర ధరలకు అనుగుణంగా మెస్, కాస్మోటిక్ చార్జీలను పెంచాలని ప్రభుత్వం వెంటనే ఆర్ఎస్‌యూ సభ్యుడు ప్రశాంత్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఆర్ఎస్‌యూ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ బీసీ, ఎస్సీ, ఎస్టీ కుటుంబాలకు చెందిన వేలాది మంది విద్యార్థులు ప్రభుత్వ సాంఘిక, సంక్షేమ హాస్టళ్లలో చదువుకుంటున్నారన్నారు. హాస్టళ్ళను అభివృద్ధి చేస్తామని చెబుతున్న పాలకులు మరోవైపు హాస్టళ్లను నిర్వీర్యం చేసేందుకు ప్రయత్నాలు కొనసాగిస్తున్నారంటూ ఆరోపించారు. 2018లో ప్రభుత్వం నిర్ణయించిన మెస్, కాస్మోటిక్ చార్జీలనే నేటికి కొనసాగిస్తున్నారని, పెరిగిన ధరలకు అనుగుణంగా చార్జీలను పెంచాలని కోరారు. సమావేశంలో ఆర్ఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి చంద్రకాంత్, నేతలు వంశీ, విక్రమ్, మల్లికార్జున, కుమార్‌లు పాల్గొన్నారు.